క్లుప్తంగా

ప్రభుత్వ మేలును తెలియజేయాలి



విలసవిల్లిలో కిట్లను అందిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి

ఉప్పలగుప్తం: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రజలకు తెలియజేయాలని మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో మేం సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ బూత్ కన్వీనర్లకు కిట్లను అందించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, మండల జేసీఎస్ కన్వీనర్ కోటుం లోవరాజు, సచివాలయ కన్వీనర్లు కోలా ఏసు, బీర నరసింహమూర్తి, దాసరి భద్రావతి, బూత్ కమిటీ సభ్యులు, గృహసారథులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఐసీడీఎస్ విస్తరణాధికారి మీనాక్షి

ఐ.పోలవరం: మండలంలోని జి.వేమవరం నల్లావారి మెరకలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ విస్తరణాధికారి జె.మీనాక్షి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పోర్టిఫైడ్ రైస్‌లో ఆహార పోషకాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఆర్ ప్రియాంక, బి.బేబిరాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ మిధున్‌రెడ్డిని కలిసిన శ్రీనివాసరావు



మిధున్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ ప్రాంతీయ కోఆర్డినేటర్, ఎంపీ పి.మిధున్‌రెడ్డిని అమలాపురానికి చెందిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు మంగళవారం తాడేపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తనను రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు శ్రీనివాసరావు మిధున్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

వివిధ పనులకు టెండర్లు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో మంగళవారం దేవస్థానానికి చెందిన వివిధ పనుల లైసెన్సుల హక్కుల నిమిత్తం అధికారులు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో వీటిని నిర్వహించారు. కొన్నింటిని ఒక సంవత్సరం కాలపరిమితికి ఖరారు చేసినట్టు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు. ఇందులో ప్రధానంగా కిరాణా, పూజాద్రవ్యాలు, డిస్పోజబుల్ సరఫరా చేసే నిమిత్తం, గోవులకు దాణా సరఫరా చేసే నిమిత్తం, లామినేషన్ ఫొటోలు, పువ్వులు, పూల దండలు సప్లయ్ చేసే నిమిత్తం టెండర్లు ఖరారు అయినట్టు ఆయన చెప్పారు. కాగా మరికొన్ని టెండర్లు టెండర్‌దారులు ఎవరూ రానందున వాయిదా వేసినట్టు ఏసీ అన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

మామిడికుదురు: మామిడికుదురు అంజు కంటి ఆస్పత్రి ఆవరణలో గురువారం అంజు ఐ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం ఏర్పాటు చేశామని మేనేజర్ పల్లి స్వామి మంగళవారం తెలిపారు. ఈ శిబిరంలో అంతర్జాతీయ గ్లకోమా వైద్య నిపుణులు డాక్టర్ ఆండ్రూ మెర్‌మండ్, రెటీనా శస్త్ర చికిత్స నిపుణులు తేజ ఉచితంగా వైద్య సేవలందిస్తారని చెప్పారు. అంజు ఇంటర్నేషనల్ ఐ కేర్ ఫౌండేషన్ కాకినాడ, విజన్ ఫర్ ఆల్ స్విట్జర్లాండ్ నిపుణుల సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఈ శిబిరం ప్రారంభమవుతుందన్నారు. నిరుపేదలకు ఉచితంగా కంటిలో అద్దం వేసే పద్ధతిలో కంటి శుక్లాలు కేటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశం పొందే వారు ఆధార్‌కార్డు తీసుకు వచ్చి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని స్వామి సూచించారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం



కాట్రేనికోనలో ఓ చిరు వ్యాపారిని ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు



పొన్నాడ ఎన్నికల ప్రచారాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ
- అడుగడుగునా బ్రహ్మరథం పట్టిన ప్రజలు

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, అవి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన కాట్రేనికోన మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మహిళలు మంగళ హారతులిచ్చి ఆయనకు స్వాగతం పలకగా యువత, వృద్ధులు ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. వేలాది మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు మోటారు బైక్‌లపై ర్యాలీగా తరలి రాగా పొన్నాడ ఎన్నికల ప్రచార రథంపై నుంచి ఓటర్లకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. కాట్రేనికోన గేటు సెంటర్, చిలకమ్మ చెరువు, ఉప్పూడి, చెయ్యేరు, సీహెచ్ గున్నేపల్లి, మహిపాల చెరువు, ముమ్మిడివరం పురవీధుల మీదుగా ఎయిమ్స్ కళాశాల వరకూ భారీ ర్యాలీగా వెళ్లి ప్రచారం నిర్వహించారు. పలు కూడళ్లలో డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో మంచి జరిగితేనే ఓటేయండని అడిగిన దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలన్నారు. ప్రజలకు మరింత సంక్షేమం కలగాలన్నా, రాష్ట్రంలో అభివృద్ధి జరగాలన్నా మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు. దేవుడు ఆశీర్వదించినట్లే ప్రజలందరూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు కోలా గంగా భవానీ, మిరియాం జ్యోతి, పాలెపు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కుడిపూడి శంకరరావు, నేల కిశోర్‌కుమార్, ముదునూరి సతీష్‌రాజు, దొమ్మేటి శామ్యూల్‌సాగర్, కోలా బాబ్జి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, నడింపల్లి సూరిబాబు, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, మండల పార్టీ అధ్యక్షులు నల్లా నరసింహమూర్తి, జగతా పద్మనాభం, పిన్నమరాజు శ్రీనివాసరాజు, కాదా గోవిందకుమార్, బొంతు సత్యశ్రీనివాస్, సంసాని నాగేశ్వరరావు, ఏడిద సుబ్బారావు, నాతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌కు అభినందనల వెల్లువ



మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ వెంకటేశ్వరరావు తదితరులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ అభ్యర్థిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను ప్రకటించిన నేపథ్యంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు తరలి వచ్చి ఆయనకు అభినందనలు తెలియజేస్తున్నారు. మంగళవారం భట్నవిల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో పేరూరు సర్పంచ్ దాసరి అరుణ, ఉప సర్పంచ్ కుడుపూడి సత్యనారాయణ, మోటూరి సత్యనారాయణల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రి విశ్వరూప్‌ను కలిసి పుష్పగుచ్ఛం, పూలదండలతో సత్కరించారు. రానున్న ఎన్నికల్లో మంత్రి విశ్వరూప్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామంటూ వారంతా నినాదాలు చేశారు. అమలాపురం 14వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు మంత్రి విశ్వరూప్‌ను కలిసి సత్కరించారు. పలు మండలాల నుంచి ప్రజలు, పార్టీ నాయకులు కలిసి మంత్రిని అభినందించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ ముమ్మర తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

అల్లవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం తరలింపులను అడ్డుకునేందుకు మండలంలోని ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది మంగళవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వాహనాలను, అల్లవరం పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ హరీష్ ద్విచక్ర వాహనాలు, ఆటోలను తనిఖీలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల కోడ్ అమలుపై తహసీల్దార్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యదర్శులు, వీఆర్‌ఓ, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మోడల్ కోడ్ అమలుచేయాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఎవరు విస్మరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సత్యనారాయణ, ఆర్‌ఐ దుర్గా శ్రీను, అధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి చేయాలి



జాతీయ సెమినార్‌లో పాల్గొన్న అధ్యాపకులు

యానాం: మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా మహిళా సాధికారతకు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ సీతామహాలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెండర్ సెన్సిటైజేషన్ ఇష్యూస్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై ప్రిన్సిపాల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన రెండు రోజుల పాటు జరిగే జాతీయ సెమీనార్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలు శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది నామాడి స్వరాజ్యలక్ష్మి, కెమిస్ట్రీ అధ్యాపకులు శాంతి కుమార్, జువాలజీ ప్రొఫెసర్ పి.మాధవి, కె.శ్రీలత, చంద్రశేఖర్, జేవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించనున్న కాలభైరవస్వామి విగ్రహం

తాళ్లరేవు: చరిత్ర ప్రసిద్ధి గాంచిన చొల్లంగి రాజరాజేశ్వరి సమేత సోమేశ్వర స్వామివారి ఆలయంలో బుధవారం ఉదయం 10.08 గంటలకు అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, కాలభైరవ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా గత రెండు రోజులుగా భూతబలి, యాగశాల ప్రవేశము, పరిషత్ విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తు హోమం జరిపారు. బుధవారం కుంభాభిషేకము, మహా పూర్ణాహుతి చేయనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతిష్ఠా మహోత్సవాలకు భక్తులంతా తరలి వచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎల్జీ తమిళిసైకు ఘనంగా వీడ్కోలు



తమిళిసైను సత్కరించిన సీఎం రంగసామి

యానాం: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా మూడేళ్ల పాటు పని చేసి రాజీనామా చేసి లోక్‌సభ ఎన్నికల బరిలో దిగుతున్న తమిళిసై సౌందరరాజన్‌కు మంగళవారం రాజ్‌నివాస్ వద్ద ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సీఎం రంగసామి తదితరులు రాజ్‌నివాస్‌కు వచ్చి దుశ్శాలువాతో ఆమెను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పుదుచ్చేరి ఎల్జీగా పనిచేయడం తనకు ఎంతగానో సంతృప్తినిచ్చిందన్నారు. ఆ అవకాశం కల్పించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు. పుదుచ్చేరి ఎంపీ సీటుకు నలుగురి స్థానికుల పేర్లు పరిశీలనలో ఉన్నాయే తప్ప తమిళిసై పేరు లేదని సీనియర్ బీజేపీ నేత ఒకరు వ్యాఖ్యానించడంతో తమిళిసై తమిళనాడు నుంచి పోటీ చేస్తారన్న చర్చ జరుగుతుంది.

విద్యార్థులకు నగదు బహుమతి



మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(పీటీడీసీ)లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లల్లో ఎస్ఎస్‌సీ–2023, ఇంటర్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థులకు ఆర్‌ఏఓ మునిస్వామి మంగళవారం నగదు బహుమతి అందజేశారు. షీగల్స్ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పని చేస్తున్న పంతాడి బుజ్జి వెంకటరావు పిల్లలు పంతాడి దేవహరిణికి రూ.6 వేలు, పంతాడి తేజేష్‌కు రూ.3,500 చెక్కులను ఆర్‌ఏఓ మునిస్వామి ఇచ్చారు.

అమ్మవారి ప్రభ ఊరేగింపు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి ప్రభ ఊరేగింపు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 11వ తేదీ నుంచి అమ్మవారి తీర్థ మహోత్సవాలు మొదలయ్యాయి. ఉదయం ఆలయం వద్ద నుంచి మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో వైభవంగా అమ్మవారి ప్రభ ఊరేగింపు గ్రామ పురవీధుల్లో సాగింది. దారి పొడవునా గరగ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి ఆలయంలో కనుల పండువగా గోకర్ణేశ్వర స్వామి, జలదుర్గ అమ్మవార్ల కల్యాణం చేశారు. మెండు ఉదయభాస్కరరావు దంపతులతో పూజారులు ఈ కల్యాణం నిర్వహించారు. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లిలో మంగళవారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల సందర్భంగా కారులో అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ కె.మనోహర జోషి తెలిపారు. తనిఖీల్లో కారులో తరలిస్తున్న 202 మద్యం బాటిళ్లు, 96 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కారును సీజ్ చేశామన్నారు. మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: పాశర్లపూడిలోని పాల్లమ్మ ఆలయం సమీపాన మంగళవారం వీరభద్రస్వామి సంబరం అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, బాణసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ ఉదయం స్వామిని మేలు కొలిపారు. అనంతరం భక్తులు వైనతేయ గోదావరి నది వరకు ఊరేగింపుగా వెళ్లారు. గోదావరి నదీస్నానంతో పాటు పలు పూజలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం శమీ పూజతో పాటు భజన ఘనంగా నిర్వహించారు. స్వామి వారి భక్తులు 60 గజాల పొడవు కలిగిన నిప్పులగుండం తొక్కారు. కొత్తలంక పుల్లయ్య అవధానులు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి చేటు

అల్లవరం: పర్యావరణానికి ప్లాస్టిక్ ఎంతో చేటు చేస్తుందని, ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని మానుకోవాలని కోరుతూ ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ విద్యార్థులు మంగళవారం బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని ఆరగట్లపాలెంలో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, డీన్ టీవీ జనార్దనరావు, మహిళా పోలీస్ బేబికుమారి, అధ్యాపకులు సుబ్రహ్మణ్యం, సాయిషణ్ముఖ్, ఎన్ఎస్ఎస్ ప్రోగామ్ ఆఫీసర్ టి.నాయుడు పాల్గొన్నారు.

రసవత్తర పోరు షురూ

- పుదుచ్చేరి ఎంపీ స్థానానికి నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ



నామినేషన్లు స్వీకరించే పుదుచ్చేరి కలెక్టర్ ఆఫీసు

యానాం: పుదుచ్చేరి ఏకైక లోక్‌సభ స్థానానికి వచ్చే నెల 19న పోలింగ్ జరగనుండగా, బుధవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్ల స్వీకరణకు ఇప్పటికే పుదుచ్చేరి కలెక్టర్ అండ్ రిటర్నింగ్ అధికారి ఆఫీసులో ఏర్పాట్లు చేశారు. ఈ నెల 27వ తేదీ వరకూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారు. 28న నామినేషన్ల పరిశీలన, 30న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశమిస్తారు. నామినేషన్లకు సంబంధించి ఫారం–2(ఎ)ను ఆయా కలెక్టర్ల ఆఫీసుల్లో ఉంచారు. జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఆన్‌లైన్ విధానం ద్వారా సైతం తమ నామినేషన్లు వేయవచ్చు. అయితే సరాసరి రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లి నామినేషన్ సమర్పించాలంటే మాత్రం నేరుగా పుదుచ్చేరి వెళ్లాల్సిందే. యానాం వాసులైతే సొంత ఖర్చులతో 850 కిలోమీటర్లు దూరం ప్రయాణించి నామినేషన్ వేయాల్సి ఉంటుంది.

నెల రోజుల పాటు రాజకీయ కోలాహలం

ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుండడంతో సుమారు నెల రోజుల పాటు రాజకీయ కోలాహలం నెలకొనబోతుంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ సీఎం, సిటింగ్ ఎంపీ వైథిలింగం పేరును ప్రకటించారు. పుదుచ్చేరిలో అధికారంలో ఉన్న ఎన్‌ఆర్‌కాంగ్రెస్–బీజేపీ కూటమి తమ అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. దీంతో పాటు డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు సైతం తమ అభ్యర్థులను రంగంలోకి దింపనున్నాయి. అయితే బీజేపీ–ఎన్‌ఆర్ కాంగ్రెస్ కూటమి, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉండొచ్చని అంతా భావిస్తున్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



తాళ్లరేవు హైస్కూల్‌లో తమ పరీక్ష గది నంబరు చూసుకుంటున్న విద్యార్థినులు



పదో తరగతి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

ముమ్మిడివరం: మండలంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, అయినాపురం, అనాతవరం ప్రభుత్వ పాఠశాల, ముమ్మిడివరం గురుకుల పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. రెండో రోజు హిందీ పరీక్షకు మొత్తంగా 733 మంది విద్యార్థులకు గాను 723 మంది హాజరవ్వగా మరో 10 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు.

పరీక్షకు 50 మంది గైర్హాజరు

తాళ్లరేవు: మండల పరిధిలోని ఐదు పరీక్షా కేంద్రాల్లోనూ పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం హిందీ పరీక్షకు 1,118 మంది విద్యార్థులకు గానూ 1,068 మంది పరీక్షకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. మరో 50 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోరంగి ఎస్‌ఐ ఎస్.రవికుమార్ నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నేడు మండలంలో ఎన్నికల ప్రచారం

ఐ.పోలవరం: టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం మండలంలోని జి.మూలపొలం రేవు నుంచి గుత్తినదీవి వరకూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు అన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వార్డు కన్వీనర్లు హాజరుకావాలని కోరారు.

వైభవంగా సింహ, ముత్యాల పందిరి వాహనోత్సవాలు



రావులపాలెంలో వేంకటేశ్వరస్వామిని సింహ వాహనంపై ఊరేగిస్తున్న గోవింద మాలధారులు

రావులపాలెం: స్థానిక అలవేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం స్వామికి సరస్వతి హోమం తదితర పూజలు వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతం స్వామిని సింహ వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథాచార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. రాత్రికి స్వామికి ముత్యాల పందిరి వాహనోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి తదితర సభ్యులు పర్యవేక్షించారు.

పీచు బొమ్మల కొనుగోలుకు ప్రతిపాదనలు



పాశర్లపూడిలో కొబ్బరి పీచు బొమ్మలను పరిశీలిస్తున్న నాబార్డు మేనేజర్ వీరబాబు

మామిడికుదురు: కోనసీమలో మహిళలు కొబ్బరిపీచుతో తయారు చేస్తున్న బొమ్మలను కొనుగోలు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేపాక్షి విక్రయ కేంద్రాల ద్వారా అమ్మేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని కాకినాడ లేపాక్షి మేనేజర్ వీరబాబు తెలిపారు. ఆయన మంగళవారం పాశర్లపూడిలోని ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో నిర్వహిస్తున్న గ్రామ దుకాన్ కొబ్బరి పీచు బొమ్మల విక్రయ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోనసీమలో మహిళలు తయారు చేస్తున్న కొబ్బరి పీచుతో తయారు చేస్తున్న బొమ్మలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎంతో మంది మహిళలకు ఉపాధి పెరుగుతుందన్నారు. తద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన పెరుగుతుందన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు సక్రమంగా మందులు అందించాలి

ఆలమూరు: కుష్ఠు వ్యాధిగ్రస్తుల ఇంటికి వెళ్లి సక్రమంగా సరైన సమయానికి మందులు అందించాలని డీపీఎంఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లో పర్యటించి కుష్ఠు వ్యాధిగ్రస్తులకు అందుతున్న చికిత్స విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అలాగే వ్యాధిగ్రస్తుల వద్దకు వెళ్లి వ్యాధి తీవ్రతపై ఆందోళన చెందవద్దన్నారు. కుష్ఠు వ్యాధి నివారణకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చినందున నిర్దేశిత సమయంలో వ్యాధి తగ్గుముఖం పడుతుందని వ్యాధిగ్రస్తుల్లో భరోసా కల్పించారు. కుష్ఠు వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యారోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిశోర్ పాల్గొన్నారు.

సీఎం రంగసామితో సమావేశం

యానాం: పుదుచ్చేరి ఏకైక పార్లమెంట్ స్థానానికి ఏప్రిల్ 19న ఎన్నిక జరగనున్న నేపథ్యంలో సీఎం రంగసామితో హోంమంత్రి నమశ్శివాయం మంగళవారం సమావేశమవ్వడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. ప్రస్తుతం బీజేపీ, ఎన్‌ఆర్‌కాంగ్రెస్ కూటమి అధికారంలో ఉన్న కారణంగా బీజేపీకే లోక్‌సభ స్థానాన్ని కేటాయించారు. అధిష్టానం నుంచి పిలుపు వస్తే లోక్‌సభ స్థానం నుంచి పోటీకి సిద్ధమని నమశ్శివాయం ఇప్పటికే స్పష్టం చేశారు. దీంతో ముఖ్యమంత్రి రంగసామితో మంగళవారం ఆయన భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. నమశ్శివాయం అభ్యర్థిత్వం ఖరారు కానుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.